## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-6-2003. సిద్దాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హిందూమతం అంటే అది ఒక సనాతనధర్మం, ఇది ఒక వ్యక్తి చేత స్థాపించబడినది కాదు. మనం పుట్టినది మొదలు చనిపోయేవరకు ఎప్పడు ఎక్కడ ఎలా జీవించాలి, మన జీవితవిధానం ఎలా ఉండాలి అని హిందూమతంలో చెప్పబడినది. హిందూమతానికి మూలం వేదం. వ్యాసుడు రాకముందు వేదంఅంతా ఒక ముద్దక్రింద ఉండేది. దానిని మనకు అనుకూలంగా నాలుగు భాగాలుగా వ్యాసుడు విభజించాడు. అందుచేత ఆయనను వేదవ్యాసుడు అంటారు. వేదంలో అన్ని విషయాలు చాలా వివరంగా చెప్పారు. కర్మగురించి చెప్పారు, జ్ఞానం గురించి చెప్పారు, ధ్యానం గురించి చెప్పారు, ఇల్లు ఎలా కట్టుకోవాలో చెప్పారు, వాస్తు గురించి చెప్పారు, వైద్యం గురించి చెప్పారు. వేదంలో చెప్పకుండా విడిచిపెట్టినది ఏదీ లేదు. వేదాల చివరిభాగంలో ఉపనిషత్‌లు ఉన్నాయి. ఆ ఉపనిషత్తులలో ఉన్న సారాన్ని వేదాంతం అంటారు. ఆ ఉపనిషత్తులసారమే భగవద్గీత. భగవంతుడిచేత గానము చేయబడిన శాస్త్రము భగవద్గీత. వేదాలు, ఉపనిత్తులు అర్థం చేసుకోవటం కష్టం అని వాటిని సూత్రాల క్రింద వ్యాసుడు వ్రాసాడు, వాటినే బ్రహ్మసూత్రాలు అంటారు. వేదాలలో ఏ పరమాత్మను తెలుసుకోమని ప్రతిపాదించారో ఆ పరమాత్మే రాముడి రూపం ధరించి ఈ భూమి మీదకు వచ్చాడు, వేదాల సారమే రామాయణం అని చెపుతారు. పూర్వజన్మలలో పుణ్యకర్మ చేసిన వాడికి, పుణ్యబలం ఉన్నవాడికి భగవంతుడి మీద విశ్వాసంకలుగుతుంది. భగవంతుడి మీద మనకు విశ్వాసం కలగటంలేదు అంటే ఆయన లేడు అనికాదు, మనకు పుణ్యబలం లేదు అని అర్థం. మనం రాముడిని ఆరాధిస్తాము, ఆంజనేయస్వామిని ఆరాధిస్తాము. రూపాలు వేరుగా మనకు కనిపిస్తున్నప్పటికి ఇద్దరూ ఒక్కటే, ఇద్దరూ సమానమే. రావణసంహారం తరువాత, రాముడి పట్టాభిషేక సందర్భంలో ఆయన గురించి ఎవరైతే శ్రమపడ్డారో అందరికీ ఎవరికి ఏమి ఇవ్వాలో అన్నీ ఇచ్చాడు కాని ఆంజనేయస్వామి దగ్గరకు వచ్చేటప్పటికీ ఆయనకు ఏమి ఇవ్వాలో పరమాత్మ అయిన రాముడికి కూడా అర్థంకాలేదు. భౌతికంగా వస్తురూపంలోఏమి ఇవ్వాలో ఆయనకు అర్థంకాక ఆంజనేయస్వామిని కౌగిలించుకొన్నాడు, అంటే ఆయనను ఆయనే యిచ్చేసుకొన్నాడు. రామనామం నిరంతరం స్మరించటం వలన మనస్సులో ఉన్న దోషాలు పోతాయి, వాడు





పవిత్రుడు అవుతాడు. రామనామం గురించి భగవాన్ ఒక మాటచెప్పారు. మనం రామనామం చేసేటప్పడు రా అన్నప్పడు నోరుతెరుచుకొంటుంది అప్పడు లోపల ఉన్న దోషాలు బయటకు వచ్చేస్తాయి. మరల బయట ఉన్న దోషాలు లోపలకు వెళ్ళటానికి చూస్తాయి కాని అవిలోపలకు రాకుండా మ అక్షరం నోరును మూసేస్తుంది, అదే రామనామం అన్నారు. రామనామం లక్ష్మీప్రదమైనది. మనం తరించటానికి రాముడి రూపం, రామనామం చాలు. రామభక్తులు అనేకమంది ఉన్నారు, ఈమధ్యకాలంలో రామదాసు, తులసీదాసు. ఒకసారి తులసీదాసు భార్య ఆయనతో ఏమి చెప్పింది అంటే నామీద నీకు ఉన్న ప్రేమ, నామీద నీకుఉన్న మోహం, నామీద నీకు ఉన్న ఆప్యాయత రాముడి మీద నీకు ఉంటే ఏనాడో నీవు బాగుపడిపోదువు అని చెప్పింది. ఆయనకు పూర్వజన్మ పుణ్యంఏదో ఉంది ఈ మాట ఆయనలో మార్పు తీసుకొనివచ్చింది, ఆయన తరించాడు. ఒక్క రాముడేకాదు, లక్ష్మణుడు, సీతమ్మ అందరూ కూడా మనకు ఆదర్శపురుషులే. రావణాసురుడు సీతమ్మతో ఏమి చెపుతాడు అంటే వాడికి రాజ్యం పోయింది, అడవులలో తిరుగుతున్నాడు. నీవు నన్ను పెళ్లిచేసుకో, సుఖపడతావు అని సీతమ్మను అడుగుతాడు. అప్పడు సీతమ్మ ఒక మాట చెపుతుంది ఇక్కడ బాగా అర్థం చేసుకోండి. ఈశ్వర నిర్ణయం ప్రకారం నేను రాముడికి భార్యగా ఉన్నాను, అది ఈశ్వర ప్రణాళిక ఇప్పడు నీవు ఏమి అడుగుతున్నావు అంటే నాకు భార్యగా ఉండు అంటున్నావు ఈశ్వరనిర్ణయం ప్రకారం నేను రాముడికి భార్యగా ఉండగా నీకు భార్యగా ఉండటం ఎలా సాధ్యం, అది సాధ్యంకాదు అనిచెప్పింది.

ఈ దేహమునీవు కాదు, మనస్సు నీవు కాదు, నీవు ఆత్మవే అని వేదము చెప్పినప్పటికి, ఈ మనస్సు నేను కాదు అని నీవు అనుకొన్నప్పటికి, మనస్సులో దోషములు ఉన్నప్పడు మనస్సు నువ్వే అనిపిస్తుంది. నేను మనస్సునుకాదు, నేను మనస్సునుకాదు అనుకొంటే మనస్సుపోతే ఈపాటికి మనం అందరం జ్ఞానులు అయిపోదుము. నా మనస్సులో ఏమీ దోషం లేనప్పడు మనస్సు నశిస్తుంది. ఎవడైతే పరమపవిత్రుడో, ఎవడి మనస్సు అయితే పరిశుద్ధం అయ్యిందో వాడికి మనస్సుతోటి, దేహంతోటి తాదాప్యం నశిస్తుంది, బ్రహ్మజ్ఞానము స్వరూపముగా వ్యక్తమవుతుంది. ఈ సృష్టి అంతా నశించినా రామ అనే ఈ రెండు అక్షరాలు నాకు చాలు అన్నారు బాపూజీ అంటే రాముడి మీద పరిపూర్ణమైన విశ్వాసం. ఆయన తలంపులు, మాటలు, చేతలు అన్నీ రామాభిముఖంగా ఉండేవి. మనపద్ధతి ఎలా

ఉంది అంటే కలకత్తా వెళ్ళాలి అనుకోవటం స్టేషన్‌కు వెళ్లి మద్రాసు వెళ్ళే రైలు ఎక్కటం. లోపల ఆలోచన ఒకటి, నోటితో చెప్పేది ఒకటి, చేతితో చేసేది ఒకటి, ఈ మూడింటికి పొంతనలేదు. మీరు కష్టపడి పెద్దపెద్ద సాధనలు చెయ్యలేకపోతే మహాత్ములు సన్నిధిలో, మహర్షుల సన్నిధిలో ఉంటే వాసనలు నశిస్తాయి, మనస్సు నశిస్తుంది, జ్ఞానము స్వరూపముగా వ్యక్తమవుతుంది, మహర్షుల సన్నిధి అట్టిది అని పెద్దలు చెపుతారు. కొంతమంది ఇంటివద్ద చిన్న కష్టంవస్తే ఎప్పడు చచ్చి పోదాము అనుకొంటారు, అలా ఏడవకండి. బ్రహ్మంగురించి శ్రవణం చేస్తూ బ్రహ్మం గురించి చింతిస్తూ, సత్కర్మ చేస్తూ జీవించండి అని ఒక ఉపనిషత్తు చెపుతుంది, మీరు తినండి, తినేది మీది అనుకోవద్దు, ఈశ్వరుడిది అనుకొని తినండి అందుచేత మొదటి ముద్దతినేటప్పడు గోవిందా, గోవిందా అంటారు. సృష్టిలో కనిపించే ప్రతీవస్తువుకూడా భగవంతుడిదే, మీది అంటూ ఏదీ లేదు, అంతా ఆయనదే. భగవాన్ ఏమంటున్నారు అంటే ఈహాలులో మీరు అందరూ బాగా చోటు సంపాదించుకొన్నారు, అందరూ బాగా కూర్చొన్నారు. ఇప్పడు ఇక్కడ ఎలాగ కూర్చొన్నారో అలాగ మీ హృదయంలో మీరు చోటు సంపాదించుకొని మీ హృదయంలో కూర్చోండి అంటున్నారు. భగవంతుడు మీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. బయట కనిపించేది అంతా నీమనస్సు కల్పించినదే లోకంలో ఉన్నదంతా స్వప్నంతో సమానము. ఈ హాలులో కూర్చోవటానికి అందరూ కంగారుపడి, కంగారుపడి చోటు సంపాదించుకొంటున్నారు. కాని మీ హృదయంలో మటుకు మీకు చోటులేదు, అక్కడ చోటు సంపాదించుకోవటానికి అసలు మీరు ప్రయత్నం చేయటం లేదు. ఈ హాలులో మీరు ఎలా కూర్చొంటున్నారో అలాగ మీ హృదయంలో చోటు సంపాదించుకొని, అక్కడ మీరు కూర్చొంటే పరమశాంతిని పొందుతారు, మీ జీవితంలో మీకు ఎప్పడూ అనుభవానికి రాని శాంతిని, సుఖాన్ని మీరు అనుభవిస్తారు, ఓహో! ఇట్టిదా ఈసుఖం, శాంతి అని మీకు అనిపిస్తుంది. అందుచేత హృదయంలో మీరు చోటు సంపాదించుకోండి, ఉన్నదంతా హృదయంలోనే ఉంది. మీ చూపును లోపలకు త్రిప్పండి ఉన్నదంతా లోపలే ఉంది, బయట ఏమీ లేదు. భగవాన్ గురించి ఒకపాట ఉంది కళ్ళుమూస్తే చూస్తాడు, కళ్ళు తెరిస్తే చూపిస్తాడు అని కళ్లు మూస్తే ఆయన హృదయంలో ఏది ఉందో అది చూసుకొంటాడు, కళ్లు తెరిస్తేఆయన హృదయంలో ఏది ఉందో మనకు చూపించటానికి ప్రయత్నం చేస్తాడు, వాడే ఋషి, వాడే జ్ఞాని, జ్ఞాని ఎక్కడో ఉంటాడు అనుకోవద్దు, మీ హృదయంలోనే ఉన్నాడు,





ఆయన హృదయనివాసి. మీతో మాట్లాడుతూ ఉన్నా, ఏదైనా పనిచేస్తున్నా ఆయన హృదయాన్ని విడిచిపెట్టి ఉండడు, వాడే జ్ఞాని. మీరు అన్నం వండుతూఉంటే రామనామస్మరణ ఎలాకుదురుతుంది అంటారు, పూజగదిలోనుండి బయటకు వస్తే రాముడిని మరచిపోతారు. జ్ఞాని ఎప్పడూ హృదయంలోనే ఉంటాడు. తనుఏది విన్నా, ఏది గ్రహిస్తూఉన్నా హృదయానికి భిన్నంగా ఆయనకు ఏదీ కనిపించదు. మీకు వచ్చే తలంపుల విషయంలో, చేసేపని విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. మరణానంతరం మీరు సంపాదించిన డబ్బు మీకూడా రాదు ఇక్కడ పెట్టిలో ఉంటుంది, లేకపోతే బ్యాంక్‌లో ఉంటుంది, మీ భార్య మీ కూడా రాదు, మీ స్నేహితులు, బంధువులు వల్లకాడు దాకా వస్తారు అంతేగాని మీకూడా రారు. అయితే చనిపోయిన తరువాత మనకూడా వచ్చేది ఏమిటి అంటే మనం చేసిన కర్మ మరణానంతరం మనకూడా వస్తుంది. అందుచేత ఈ శరీరం ఇక్కడ ఉండగానే సత్కర్మను ఆచరిస్తూ హృదయములోనికి వెళ్లటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు పొందవలసింది అంతా హృదయంలోనే ఉంది. ఉన్నది ఒక్కటే వస్తువు అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు సర్వత్రా అదే నీకు కనిపిస్తుంది. గురువు ఏమి చేస్తాడు అంటే మీలో ఉన్న బలహీనతలు ఏమిటో చూస్తూ ఉంటాడు. ఆ బలహీనతలు మీకు తెలియవు. మీ జీవితాన్ని కరెక్టు చేయడం కోసం ఆ బలహీనతలను మీకు చూపించి వాటిని తొలగిస్తాడు, వాడు గురువు. అయితే గురువు చేసే పని మన కళ్ళకు కనబడదు. కాబట్టి గురువు ఏమి చేయటం లేదు అనుకుంటాము. ఆయన పనిచేస్తున్నాడు, కాని ఆవేగాన్ని మీ కళ్ళు చూడలేవు. మనము చాలా మంచి వారము అనుకొంటాము. మనలో అసూయ ఉంది అనుకోండి అదిమనకు తెలియదు అది తెలియటానికి తగిన సన్నివేశాన్ని కల్పిస్తాడు. ఓహో మనలో కూడా అసూయ ఉందన్నమాట అని అప్పడు తెలుస్తుంది. ఇలా మనలో ఉన్న బలహీనతలను మనకు తెలియజేసి, వాటితో పోరాడి వాటిని జయించే శక్తిని మనకు అనుగ్రహించి, వాటిని తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, వాడు గురువు. మనచేతిలో ఉన్నది వెండి, కాని బంగారం, బంగారం అనుకుంటున్నాము అనుకోండి అది వెండి, బంగారం కాదు అని గురువుకు తెలుసు అప్పడు ఏమి చేస్తాడు అంటే ఎవడిచేతో నాలుగు మొట్టికాయలు మొట్టించి, అది బంగారము కాదు, అది వెండి అని బోధించి బంగారాన్ని పట్టుకొనేలా చేస్తాడు వాడు గురువు. గురువు కలుగచేసుకోడు అనుకోండి వెండిని చూచి ఇదే బంగారం అనుకొంటూ ఉంటాము, అలా కోటి జన్మలు వెళ్లిపోతాయి. మీ బుద్ధిలో

ఉన్న దోషాలను తొలగించడం కోసం మీరు అనుకొనేది నిజం కాదు, నిజం కానిది నిజం అనుకొంటున్నారు అని మీకు తెలియజేసి మీ బుద్ధిని కరెక్టు చేస్తాడు వాడు గురువు, మీరు హృదయములోనికి ప్రవేశించకుండా నేను, నాది అనే తలంపులు ప్రధానముగా అడ్డువస్తున్నాయి. ఈ రెండు తలంపులనుండి విడుదల పొందటానికి మీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. ఈ రెండు తలంపులనుండి బయటకువస్తే గాని మీకు అమృతానుభవం కలుగదు. మనందరకు దేహం అంటే బాగా ఇష్టం, ఈ దేహం కోసం ఎవరితోనైనా కలబడిపోతాము, కనీసము అమ్మ ఏదైనా అన్నా దానిని స్మశానంకు వెళ్లే వరకు గుర్తుపెట్టుకొంటాము, వాటిని తలకాయలో మోస్తూ ఉంటాము. వాటిని మర్చిపోతే మనకు జ్ఞానం కలుగుతుంది. కాని ఆ మరుపు మనకు రావటం లేదు. అస్తమాను వాటినే తలపెట్టుకుంటూ ఉంటాము. గాఢనిద్రలో మనం సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము, గాఢనిద్రలో ఎవరికీ దేహం గొడవలేదు, దేహం నేను అనే తలంపు లేదు. దేహానికి సంబంధించిన ధ్యాస లేనప్పుడు మనం శాంతిగా ఉన్నాము కాని అశాంతి మనకు లేదు. ఇది మీరు గుర్తు పెట్టుకోండి, అప్పుడు దేహం యొక్క ప్రాముఖ్యత తగ్గుతూ ఉంటుంది. ప్రతీ దేహానికి ఒకో ప్రారబ్దం ఉంటుంది. మంచి ఎదురవుతుంది. చెడు ఎదురవుతూ ఉంటుంది. ఏది ఎదురైనా పంచదార నోట్లో పోసుకొన్నట్లు ప్రారబ్దాన్ని ఎంజాయ్ చెయ్యండి, ప్రారబ్దం నశిస్తుంది. ఈజన్మలో ఏదో పనిని భగవంతుడు అప్పగించాడు, ఆపనిని ఇష్టంతో చెయ్యండి కర్మ నశిస్తుంది. ఇష్టంగా చెయ్యకపోతే కర్మ పెరుగుతూ ఉంటుంది, రామకృష్ణుడు ఏమి చెబుతున్నాడు అంటే మీ హృదయంలో రాముడు లేడు మీ హృదయంలో సంసారం ఉంది. మీ హృదయంలో రాముడు ఉంటే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. మీ హృదయంలో సంసారం పెట్టుకొని బ్రహ్మజ్ఞానం కావాలనుకొంటున్నారు. ఎలా వస్తుంది? బ్యాంక్ లాకర్‌లో బంగారం పెట్టుకొంటారా లేక కూరగాయలు పెట్టుకొంటారా? లాకర్లో బంగారం పెట్టుకొంటారు. అలాగే నీ హృదయంలో రాముడిని పెట్టుకో. ఎక్కడ ఎవరిని నిలబెట్టుకోవాలో అక్కడ వారిని నిలబెట్టు. జ్ఞానికి ఒక రూపం ఉన్నా రూపరహితుడే. ఒకనామం ఉన్నా నామరహితుడే, జ్ఞాని నివాసము హృదయమే. వాల్మీకి ఎంత ప్రమాణబుద్ధితో చెప్పాడు అంటే నదులలో నీరు ఎంతకాలం అయితే ప్రవహిస్తుందో, సూర్యచంద్రులు ఎంతకాలం అయితే ఉంటారో, ఈ సృష్టి ఎంతకాలం ఉంటుందో, అంతకాలం ఈ రచన నిలబడిఉంటుంది అని చెప్పాడు, అది రామాయణం.

**5-7-2003**

మీకు రాముడి మీద నమ్మకం లేకపోవచ్చు, మీకు నమ్మకం లేదు అని అదిపోదు. మనం ఏదో శ్లోకాలు చదువుతున్నాము. కాని మనకు తగిన యోగ్యత లేదు అందువలన ఆశ్లోకాలను ఎంజాయ్ చేయలేకపోతున్నాము. పచ్చికాయను ముగ్గేస్తే అది ముగ్గదు, కుళ్లిపోతుంది. మన పరిస్థితికూడా అలాగే ఉంది. మీరు స్వార్థం లేకుండా మీ శరీరాన్ని మర్చిపోయి, మనస్సును మర్చిపోయి, కీర్తిని మర్చిపోయి సమాజం కోసం ఎప్పుడైనా చిన్న మంచి పని చేసారా అంటే చేయలేదు కాని మనకు జ్ఞానం వచ్చేయాలి, ఎలా వస్తుంది? మన శరీరం చనిపోయాక దానిని కట్టెలు కాలుస్తాయి, కాని బ్రతికి ఉండగా ఆశరీరాన్ని భయం, చింత కాలుస్తాయి. మీకు చింతాకంత చింతఉంటే అది మీ శరీరాన్ని కాల్చేస్తూ ఉంటుంది. కట్టెలు చనిపోయిన మనిషిని కాలుస్తాయి, చింతబ్రతికిఉన్న మనిషిని కాలుస్తుంది. సాధనలో మీరు బాగా అభివృద్ధి పొందాలంటే దుఃఖకారణం ఏదైన ఉన్నప్పటికీ మీరు సంతోషంగా ఉండటానికి ప్రయ్నతం చేయండి. అయ్యో పాపం వీరికి దుఃఖం రావటానికి ఎన్నో కారణాలు ఉన్నాయి కాని ఎప్పుడూ సంతోషంగా ఉంటున్నారు అని ఈశ్వరుడు తన దయను మీ శిరస్సు మీద కురిపిస్తాడు, ఆయన దయతోటి మిమ్మల్ని తడుపుతాడు అందుచేత సాధకుడు ఎప్పుడూ సంతోషంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. మీ ఇంట్లో ఉన్న మనుషులు కూడా మీ వారు కాదు, ఈశ్వరుడు వారిని మనకు కేటాయించాడు. పూర్వజన్మలో ఉన్న అనుబంధాన్ని బట్టి, వారి ద్వారా మీరు పొందవలసిన అనుభవాలు ఉంటే వారిని మీకు కేటాయించాడు వారు మీ సొంతం కాదు, అజ్ఞానం వలన వారందరూ మీ సొంతం అని మీకు అనిపిస్తుంది. ఈ ఒక్కమాట మీరు అర్థం చేసుకోండి. ఎక్కడో అడవిలో ఒక మామిడిపండు తయారవుతోంది అనుకోండి తయారయ్యేటప్పడే అది ఎవడి నోట్లోకి వెళ్ళాలో ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. అది వందచేతులు మారవచ్చు. ఆవందమంది ఓనర్సుకాదు, తిన్నవాడే ఓనరు, చివరకు దాని ఓనరు ఎవరో వెతుక్కొంటూ వెళ్లి సరిగ్గా వాడినోటిలో పడుతుంది. ఇది నమ్మటానికి ఆశ్చర్యంగా ఉంటుంది, ఇది నిజమా అనిపిస్తుంది, ఇది ఈశ్వరుని ప్రణాళిక మామిడిపండే కాదు ప్రతీదీ అంతే, మనుషులు కూడా అంతే. భారతదేశంలో కోట్లాదిమంది ఉంటే మీ ఇంట్లో నలుగురే ఉండటంఏమిటి, మిగతావారికి మీకు ఎందుకు సంబంధంలేదు. దేహప్రారబ్దాన్ని బట్టి భగవంతుడు ఆనలుగురిని మీకు కేటాయించాడు. వారు మీ ఇంట్లో ఉన్నప్పుడు కూడా వారు మీవారు కాదు, ఈశ్వరుడివారే. వాళ్ళు మనవారే అని మనం అనుకొంటాము కాని

